క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



అన్నదాత దేవిమునిరాజును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలోని మూలస్థానమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రాహుకాల పూజలు చేశారు. అనంతరం 100మంది మద్యం ప్రియులు అమ్మవారి ఎదుట మద్యం ముట్టమని సత్య ప్రమాణం చేశారు. మధ్యాహ్నం చంద్రగిరి పట్టణం కోట గ్రామానికి చెందిన మూలస్థానమ్మ ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యురాలు దేవి మునిరాజ వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదాతను చైర్మన్, పాలక మండల సభ్యులు ఘనంగా సత్కరించారు.

నేడు చంద్రగిరిలో విద్యుత్‌కు అంతరాయం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో సబ్‌స్టేషన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చంద్రగిరి డీఈ శేషాద్రిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చంద్రగిరి టౌన్‌తో పాటు మండలంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

13వ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి తుడా: స్థానిక 13వ డివిజన్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు పలు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాపూరి రాజేష్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రాపూరి ప్రసాద్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ వితరణ



స్మార్ట్‌సిటీ ఎండీ హరిత నుంచి క్రికెట్ కిట్‌ను అందుకుంటున్న జర్నలిస్టులు

తిరుపతి తుడా: జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా అసోసియేషన్‌కు క్రికెట్ కిట్‌ను శుక్రవారం తిరుపతి స్మార్ట్ సిటీ ఎండీ డి.హరిత వితరణ చేశారు. రాష్ట్ర స్థాయి జోనల్స్ క్రికెట్ పోటీలు ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు కిట్ బహూకరించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శివశంకర్, జిల్లా అధ్యక్షుడు పులిగోరు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ప్రసాద్, మేనేజర్ విజయ్ యాదవ్ కిట్‌ను అందుకున్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

పాకాల: స్థానిక పోలీస్ స్టేషన్‌ని శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. సెల్ రూం, రికార్డులు భద్రపరచు గది, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సంవత్సరం కావడంతో రాజకీయ గొడవలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తు చర్యల్లో భాగంగా గొడవలకు కారణమయ్యే అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, సీఐ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఐటీయూ రాష్ట్ర సమావేశాలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో శనివారం నుంచి 13వ తేదీ వరకు సీఐటీయూ రాష్ట్ర సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు తెలిపారు. ఆయన శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. పెన్షన్ కోసం కార్మికుల జీతంలో చెల్లించే 10 శాతం మాత్రమే గ్యారంటీ చేశారన్నారు. 2.4 లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, 10.117 మందిని మాత్రమే పర్మినెంట్ చేయడం శోచనీయమన్నారు. టీటీడీలో 25 ఏళ్లకుపైగా పని చేస్తున్న అటవీ కార్మికులు రెగ్యులరైజేషన్‌కు నోచుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో జరగనున్న సమావేశాల్లో సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

గడప వద్దకే ప్రభుత్వ సేవలు

నాడు...

తిరుపతి రూరల్ మండలం కేసీపేటకు చెందిన రమణకు 2018లో ఆడపిల్ల జన్మించింది. జనన ధ్రువీకరణ పత్రం కోసం పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. అధికారులు వివిధ కారణాలు చెబుతూ నెలల తరబడి తిప్పించుకున్నారు. చివరకు మధ్యవర్తులకు రూ.800 నగదు చెల్లిస్తే కాని పని కాలేదు.

నేడు...

తిరుపతి రూరల్ మండలం తిరుమలనగర్‌కు చెందిన రమేష్‌కు చిన్న వ్యాపారం చేసేందుకు లేబర్ సర్టిఫికెట్ అవసరమైంది. వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి, వివరాలు తీసుకుని దరఖాస్తు పూర్తి చేసి గ్రామంలోనే ఉన్న సచివాలయంలో అందజేశాడు. రోజుల వ్యవధిలోనే సర్టిఫికెట్ వచ్చింది. దాన్ని వలంటీర్ ఇంటికే తెచ్చి ఇచ్చాడు. ఎవరికీ డబ్బు ఇవ్వలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతోందని రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ఇలా ఒకటి రెండు కాదు...దాదాపు 536 సేవలను గ్రామాల్లోనే ప్రజలకు అందజేస్తున్నారు. అవినీతి లేని, వేగవంతమైన సేవలు అందుతుండడంతో ప్రజలు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- సచివాలయాలతో ఇంటికే చేరుతున్న 536 సేవలు
- తిరుపతి రూరల్ మండలంలో 37 సచివాలయాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తిరుపతి రూరల్:
మండలం: తిరుపతి రూరల్
2011 జనాభా లెక్కల ప్రకారం
జనాభా: 1.40 లక్షలు
ఇళ్ల సంఖ్య: 35,143
మండలంలోని పంచాయతీలు: 34
సచివాలయాల సంఖ్య: 37
సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులు: 314 మంది
సచివాలయాల్లో అందిస్తున్న సేవలు సంఖ్య: 536



సప్తగిరికాలనీలోని నూతన సచివాలయం

సచివాలయాలతో సత్ఫలితాలు

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందిచాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 2019 అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. తద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలనూ క్షేత్రస్థాయిలో అందిస్తున్నారు. తిరుపతి రూరల్ మండలంలో మొత్తం 34 పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 35,143 ఇళ్లు ఉన్నాయి. 1,40,239 మంది జనాభా ఉన్నారు. మండలంలో 37 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయంలో 8 నుంచి 9 మంది కార్యదర్శులు వారికి కేటాయించిన విభాగాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఇలా మండలంలో 314 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఈ సచివాలయాల ద్వారా 536 రకాల సేవలు అందించడం విశేషం.

మధ్యవర్తులు, అవినీతికి చెక్

ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే సాధారణ పౌరులు ఎన్నో కష్టాలు పడేవారు. మధ్యవర్తులను ఆశ్రయించి కొంత మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. సచివాలయ వ్యవస్థ రాకతో వాటికి చెక్ పడింది. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో సచివాలయ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.

సదుపాయాల కల్పనే ధ్యేయం



ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. 536 రకాల సేవలను ప్రజలకు ఇంటి వద్దే అందజేస్తున్నాం. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించినంత వరకు మధ్యలో ప్రభుత్వ పరంగా అందాల్సిన సేవలన్నీ సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ వెంకటనారాయణ, ఎంపీడీఓ, తిరుపతి రూరల్

ఇంటికే వచ్చి సేవలు అందిస్తున్నారు



గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత సచివాలయాల పెట్టి మా కష్టాలు తీర్చారు. వలంటీర్లు ఇంటికి వచ్చి పనులను ఉచితంగానే చేస్తున్నారు. పథకాల కోసం వలంటీర్లు, కార్యదర్శులు ఇంటికే వచ్చి వివరాలు సేకరించుస్తున్నారు.

–మోహన్, కేసీపేట, తిరుపతి రూరల్

ఎస్సీ, ఎస్టీలకే సబ్‌ప్లాన్ నిధులు వెచ్చించాలి



మట్లాడుతున్న కరవది సుబ్బారావు

తిరుపతి కల్చరల్: సబ్ ప్లాన్ నిధులను ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికే వినియోగించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించడం లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు మాట్లాడుతూ దళితులు, గిరిజనుల భూముల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చిట్టిబాబు మాట్లాడుతూ ఏడేళ్ల బడ్జెట్ కేటాయింపుల్లో జనాభా ప్రకారం చేయకపోవడంతో దళితులు, ఆదివాసీలు సుమారు రూ.1.41 లక్షల కోట్లు నష్టపోయారని తెలిపారు. చట్టం ప్రకారం పథకాలను రూపొందించి నిధులను కేటాయించాలని తెలిపారు. పూర్వ సాంఘిక సంక్షేమ జాయింట్ డైరెక్టర్ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ సబ్ ప్లాన్ నిధులు, వినియోగం, లబ్ధిదారుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని కోరారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు.

వేరుశనగ విత్తన కాయల పంపిణీ



వేరుశనగ కాయలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

పాకాల: మండలంలోని పంటపల్లి ఆర్బీకేలో శుక్రవారం ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి వేరుశనగ విత్తన కాయలు పంపిణీని ప్రారంభించారు. ఏఓ పుష్పావతి మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్బీకేల్లో వేరుశనగ విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలానికి 820 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. 30 కేజీల బస్తా సబ్సిడీతో రూ.1674లకు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, నంగా నితిన్‌రెడ్డి, ఏఈఓ అమీర్ పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల పెంపుపై హర్షం

తిరుపతి ఎడ్యుకేషన్: సంక్రాంతి సెలవులను ముక్కనుమ వరకు పెంచడంపై హిందూ ఉపాధ్యాయ సమితి (హెచ్‌యూఎస్) జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జనవరి తొమ్మిది నుంచి 18వ తేదీ వరకు కనుమ, ముక్కనుమను కలుపుకుని సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్టు అకడమిక్ క్యాలెండర్ రూపొందించడంపై హిందూ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పండుగలు జరుపుకోవడమంటే మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడమేనని, ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి ఈ నెల 2వ తేదీన హెచ్‌యూఎస్ తీసుకెళ్లిందని తెలిపారు. తమ విన్నపాన్ని పరిశీలించి సానుకూలంగా స్పందిస్తూ అకడమిక్ క్యాలెండర్లో జనవరి 9 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించడం హర్షనీయమని వెల్లడించారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని దామినేడు సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. అతనికి సుమారు 55 ఏళ్లు ఉంటాయని, తెలుపు, సిమెంటు రంగ చొక్కా, సిమెంటు రంగు నిక్కరు ధరించాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

12న పుంగనూరులో ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆహ్వాన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: పుంగనూరులోని అంబేడ్కర్ భవన్ సమీపంలోనున్న ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 12న ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్టు సభ ఆహ్వాన కమిటీ చైర్మన్ కల్లూరి నాగరాజు గౌడ్, కన్వీనర్ మల్లారపు మధు తెలిపారు. వారు శుక్రవారం ఒక ప్రైవేట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనారిటీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఇందులో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మేరుగ నాగార్జున, కె.నారాయణస్వామి, రాజన్నదొర, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనారిటీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. నాగేంద్ర, భాస్కర్, రోహిత్, రాజేంద్ర, మోహన్, వసంతకుమార్ పాల్గొన్నారు.

జేపీ నడ్డాకు ఘన స్వాగతం



జేపీ నడ్డాకు స్వాగతం పలుకుతున్న నేతలు

తిరుపతి గాంధీ రోడ్డు: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఆ పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి పద్మావతి అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు. శ్రీకాళహస్తిలో శనివారం జరగనున్న బహిరంగ సభలో పాల్గొనేందుకు ఆయన తిరుపతికి చేరుకున్నారు. ఆయనకు ఆ పార్టీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్ స్వాగతం పలికారు.

రైతులకు అండగా ఆర్బీకేలు

- స్థానికంగానే అన్ని సేవలు
- పంటల సాగులో మెళకువలు
- పొలంలోనే అవగాహన కార్యక్రమాలు



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది(ఫైల్)

ఎర్రావారిపాళెం(భాకరాపేట): రైతు బాగుంటే దేశం అభివృద్ధి పథంలో సాగుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు స్థానికంగా అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు పంటల సాగులో అవగాహన కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామంలో సచివాలయానికి అనుసంధానంగా ఒక ఆర్బీకే పనిచేస్తోంది. ఆర్బీకేల్లో పనిచేసే సిబ్బంది ఏ భూమిలో ఏ పంట సాగు చేయాలి, ఎంత మేరకు ఎరువు వాడాలి, పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా నమోదు, విత్తనాలు, ఎరువులు, ఈ క్రాప్ రిజిస్ట్రేషన్ తదితరాల నమోదులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ట్రాక్టర్లు, యంత్రాల పంపిణీ ప్రక్రియలను కూడా రైతు భరోసా కేంద్రాలే చూస్తున్నాయి. తద్వారా రైతులకు పంటల సాగులో వ్యయప్రయాసలు తగ్గాయి. ఎర్రావారిపాళెం మండలంలో 12 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 349 మంది రైతులకు క్రాప్ ఇన్సూరెన్సు కింద రూ.29,47,785, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 1,320 మంది రైతులకు రూ.58,56,006, రైతు భరోసా కింద 5,567 మంది రైతులకు 16,70,10,000, సున్నా వడ్డీ రుణాల కింద 1,282 మంది రైతులకు 31,60,638లను ప్రభుత్వం అందజేసింది.

పాడి పరిశ్రమకు అభివృద్ధికి చర్యలు

రైతులు పశుగ్రాసం కొరతతో ఇబ్బంది పడకుండా ఆర్బీకే సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పశు గ్రాసాన్ని పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పశుగ్రాసం విత్తనాలతోపాటు పశువులకు అవసరమైన దాణా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పశువులు అనారోగ్యం బారిన పడితే పశుసంవర్ధక శాఖ సహాయకులు రైతుల ఇంటి వద్దకే వెళ్లి చికిత్స చేస్తున్నారు. మండలంలో పశువులు 17,842, గేదెలు 42, గొర్రెలు 38,363, మేకలు 9,962, కోళ్లు 37,259 ఉన్నాయి.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న 51 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నివాసులై ఉండి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉంటుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తామని వెల్లడించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం ఏపీ హైకోర్టు జడ్జి టీ.రాజశేఖర్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పుదుచ్చేరి స్పీకర్ ఆర్. సెల్వం, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సినీ డైరెక్టర్ చిన్నికృష్ణ దర్శించుకున్నారు. దర్శనానంతరం అధికారులు ప్రసాదాలతో సత్కరించారు.

తిరుచ్చిపై సిరులతల్లి చిద్విలాసం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు కూర్చిన ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శ్రీకృష్ణముఖ మండపం వద్ద కొలువుదీర్చి కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం శ్రీవారి దేవేరి తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ప్రసాద్, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

శరవేగంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు



సీతమ్మనగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎంఆర్ పల్లి కూడలి– మహిళా యూనివర్సిటీ రోడ్డును కలుపుతూ సీతమ్మనగర్ మీదుగా అభివృద్ధి చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న ఎలక్ట్రికల్ ప్యాకేజ్ సబ్‌స్టేషన్‌ను మరో ప్రాంతానికి తరలించడంపై ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర విస్తరణ, నగరానికి కనెక్టివిటీ పెంచడం, ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ఇప్పటికే 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను చేపట్టామన్నారు. వీటిలో ఇప్పటికే ఆరింటిని ప్రజలకు అంకితం చేశామన్నారు. మరో 10 రోడ్లు తుదిదశకు చేరుకున్నాయన్నారు. ఎస్వీయూనివర్సిటీ రోడ్డు–జూపార్క్ రోడ్డును కలుపుతూ మరో 3 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎంఆర్ పల్లి నుంచి మహిళా యూనివర్సిటీ రోడ్డుకు వెళ్లాలంటే ట్రాఫిక్‌లో సుదూరంగా ప్రయాణించాల్సి ఉందని, సీతమ్మనగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డుతో రెండు మూడు నిముషాల్లోనే చేరుకోవచ్చన్నారు. ఈ రోడ్డుకు మరిన్ని లింక్ రోడ్లు కలుస్తుండటంతో ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఎస్పీడీసీఎల్ డీఈ వాసుదేవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మాకం చంద్ర, బ్రహ్మానందరెడ్డి, వెంకటమునిరెడ్డి, పడమటి కుమార్, వీర అనిల్, సోమశేఖర్ రెడ్డి, డిష్ చంద్ర, రమేష్ రెడ్డి, తిమ్మారెడ్డి, సద్దాబాబుయాదవ్, బాలకృష్ణాయాదవ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

మోహిత్‌రెడ్డి పాదయాత్రపై సమీక్ష



మాట్లాడుతున్న నంగా కపిలేశ్వర్‌రెడ్డి

పాకాల: వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపడుతున్న గడప గడపకూ మహా పాదయాత్రపై శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పాకాల డివిజన్ అధ్యక్షుడు నంగా కపిలేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఈ నెల 12 నుంచి గడప గడప మహా పాదయాత్ర ఉంటుందన్నారు. సోమవారం నేంద్రగుంట నుంచి బందార్లపల్లి వరకు బైక్ ర్యాలీ చేపడతామన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగన్నాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, మధు, కాముడు, మురళి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో పలువురు వక్తలు

తిరుపతి అర్బన్: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ సైనార్ మధుబాల తెలిపారు. తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ గ్రేడ్–1 గ్రంథాలయంలో మే 8వ తేదీ నుంచి చేపట్టిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఆమె మాట్లాడుతూ శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిజజీవితంలో అనుసరించాలని సూచించారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా క్రమశిక్షణ పెరుగుతుందని వెల్లడించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. గోవింద ధామం ఫౌండర్ ప్రెసిడెంట్ దామోదరం, నారాయణ, గోపాల్, ముషీర్ అహ్మద్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రం మహిషాసురుడు



మహిషాసురుడు చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో డాక్టర్ గురుప్రసాద్

తిరుపతి కల్చరల్: ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గురుప్రసాద్ హీరోగా నటించి రూపొందించిన సందేశాత్మక చిత్రం మహిషాసురుడును ఆదరించాలని ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరిరావు, ప్రముఖ వైద్యులు యుగంధర్, హరికృష్ణ కోరారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత వైద్యరంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక వైద్య పోకడల నేపథ్యంలో పేదలకు సైతం గుండె చికిత్సలు అందించే విధానం ఇతివృత్తంగా పలు ట్విస్ట్‌లతో కొత్త కోణంలో మహిషాసురుడు చిత్రాన్ని రూపొందించినట్టు తెలిపారు. 1996లో ఎస్వీ మెడికల్ కళాశాలలో వైద్య విద్య అభ్యసించిన తిరుపతి వాసి డాక్టర్ గురుప్రాద్ హీరోగా, నిర్మాతగా దీన్ని రూపొందించారని పేర్కొన్నారు. ఈ చిత్రం ఆదివారం తిరుపతిలో విడుదల అవుతోందని తెలిపారు. చిత్రం నిర్మాత, హీరో డాక్టర్ గురుప్రసాద్ మాట్లాడుతూ తమ చిత్రం చక్కటి ఫ్యామిలీ కంటెంట్‌తో ఉంటుందన్నారు. కుటుంబ సమేతంగా చూసి ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో మహిషాసురుడు చిత్ర దర్శకుడు రవికుమార్ పాల్గొన్నారు.